క్లుప్తంగా

1కే మారథాన్ రన్‌కు విశేష స్పందన



రన్‌లో పాల్గొన్న యువత, అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 1 కె మారథాన్ రన్‌ను నిర్వహించారు. స్థానిక తహసీల్ గ్రౌండ్ నుంచి పట్టణంలోని రాజీవ్ చౌక్ వరకు కిలోమీటర్ వరకు రన్ కొనసాగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ యువతకు స్వచ్ఛత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది, పట్టణానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి అడ్డుకట్ట



షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న అధికారులు

కంది(సంగారెడ్డి): గ్రామంలోని ప్రధాన వీధిలో షాపు ఎదుట ఏర్పాటు చేస్తున్న షెడ్డు నిర్మాణాన్ని పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. శనివారం మాజీ వార్డు సభ్యులు కుమార్, జంగయ్య, గ్రామస్తులు షెడ్డు నిర్మాణంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ ఈఓ గిరిధర్ గౌడ్ సిబ్బందితో వెళ్లి షెడ్డు నిర్మాణం పనులను వెంటనే నిలిపివేయాలని యజమానికి సూచించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు మల్లేశం, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

వేతనాలు చెల్లించండి

నారాయణఖేడ్: మనూరు మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పెండింగ్ వేతనాలతో పాటు, కాస్మోటిక్స్, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.18వేల వేతనం, పీఎఫ్ సదుపాయం కల్పించి, వారసత్వ ఉద్యోగం కల్పించాలన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రం శనివారం ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు.

కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొని దర్శించుకున్నా రు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డిలు దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గత మూడు రోజులుగా ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం అంతర్‌గాంలో శనివారం పిడుగు పడి ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మాలఅంజయ్య పొలం వద్ద ఎద్దును కట్టేశాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగుపడి ఎద్దు మృతి చెందింది. రూ. 70 వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు విలపించాడు.

పారిశుద్ధ్యం పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని ప్రధాన మురికి కాల్వల్లో మురుగు నిల్వ లేకుండా కార్మికులు చెత్తను తొలగించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. దీంతో ఎన్‌జీఓఎస్ తదితర కాలనీల నుంచి వచ్చే మురికినీరు కల్వర్టు వద్ద జామ్ అవుతుందని చెత్తను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అంటురోగాల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అడుగడుగునా గుంతలే

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఈ నెలలో ఇద్దరు యువకుల మృతి.. ఒకరి పరిస్థితి విషమం

రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. అసలే గతుకుల రోడ్లు.. ఇటీవల కురిసిన వర్షాలకు మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి దాపురించిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 15న మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులో నారింజ వాగు వద్ద ఏర్పడిన గుంతలను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అధ్వానంగా మారిన రోడ్లకు కనీసం మరమత్తులు కూడా చేయకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రులు వచ్చినప్పుడు మాత్రమే ఆయా రోడ్లకు కొద్దిపాటి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు అనంతరం వాటిని గురించి పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- మండలంలోని జహీరాబాద్ నుంచి బీదర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. నారింజ వాగు నుంచి కర్నాటక సరిహద్దు వరకు బీటీ లేచిపోయి అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.



ఇటీవల కురిసిన వర్షానికి అధ్వానంగా న్యాల్‌కల్-మిర్జాపూర్(ఎన్) రోడ్డు

వర్షాలు పడటంతో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

- గుంజోటి-హుస్నెల్లి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇటీవల వేసిన రోడ్డు నాణ్యతా లోపించి, బీటీ లేచిపోయి గుంతలమయంగా మారింది.
- చాల్కి నుంచి బీదర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. సమీపంలో బీదర్ పట్టణం ఉన్నందున ఎక్కువ మంది ప్రజలు నిత్యం బీదర్‌కు రాకపోకలు సాగిస్తుంటారు.
- న్యాల్‌కల్ నుంచి రాయికోడ్ మండల పరిధిలోని హుల్గెరకు వెళ్లే రోడ్డుపై కంకర లేచిపోయి వాహనాలు, పాదచారులు కూడా నడవలేని విధంగా మారింది.
- డప్పూర్ నుంచి వడ్డి వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా మారింది. ఫలితంగా ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు



జహీరాబాద్-బీదర్, చాల్కి-బీదర్, రాంతీర్థ్-బీదర్ రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై వేసిన బీటీ లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించబోయే క్రమంలో ప్రయాణికులు చనిపోతున్నారు. కొద్దిపాటి వర్షం పడ్డ రోడ్లపై గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

-రాజప్ప, చాల్కి

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 15న రోడ్డు ప్రమాదం జరగడంతో అధికారులు అక్కడక్కడా కొంత మట్టిని పోసి చేతులు దులుపుకున్నారు. వాహనాల రద్దీ అధికంగా ఉండడం, వర్షం కురవడంతో వేసిన మట్టి వెంటనే తొలగిపోయి మళ్లి గుంతలే దర్శమిస్తున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమంలో బాపూజీది కీలక పాత్ర

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్వాతంత్ర సమరయోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, కంకర సీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రం కోసం పరితపించిన బాపూజీ

పటాన్‌చెరు టౌన్: స్వరాష్ట్రం కోసం పరితపించిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా చిట్కుల్ ఎన్‌ఎంఆర్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర సమరయోధులు, గొప్ప తెలంగాణ వాది, నిబద్ధత ఉన్న నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, పాల్గొన్నారు.

చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం

సంగారెడ్డి : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ వాది, తెలంగాణ సామాజిక చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం కొండా లక్ష్మణ్ బాపూజీ అని వైఎస్ఆర్ సీపీ మాజీ అధ్యక్షుడు ప్రభు పేర్కొన్నారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులర్పించారు.

ఫోరం ఫర్ బెటర్ ఆధ్వర్యంలో..

ఫోరంఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని సంగారెడ్డిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి



మృతుడి భార్యకు హామీ పత్రం అందజేస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): అందోలు మండలంలోని తాలెల్మ గ్రామంలో శుక్రవారం వీధిదీపాలు అమర్చే క్రమంలో పంచాయతీ కార్మికుడు మన్నె లక్ష్మయ్య విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. విధుల నిర్వహణలో మృతి చెందిన లక్ష్మయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. దీంతో మండల స్పెషల్ ఆఫీసర్ గీత, ఎంపీడీఓ రాజేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, ఎంపీఓ అశోక్‌కుమార్ అక్కడి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. విద్యుత్ శాఖ నుంచి రూ.5 లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.2.30 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయడంతో పాటు గ్రామ పంచాయతీ నుంచి రూ.2లక్షల నగదును అందజేస్తామని విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

లింక్ రోడ్డును పూర్తి చేయాలని ధర్నా

రామచంద్రాపురం (పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 152 లింక్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది టిప్పర్లు రాక పొంగల్ సాగిస్తున్నాయని తెలిపారు. దీంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. సుమారు ఐదువేల మంది ప్రజలు ఈ రోడ్డు కారణంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, సమస్యను పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న స్థానికులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- ఎంపీడీఓ శ్రీనివాస్



రోడ్లను శుభ్రం చేస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎద్దు మైలారంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. తడి,పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనంలో వేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఓడిఎఫ్ అధికారులు విజయదత్, బాబ్జి, రాందాస్, అమిత్ కుమార్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'పై చిత్రలేఖనం పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: 'స్వచ్ఛతా హీ సేవ' లో భాగంగా విద్యార్థులకు సృజనాత్మకత చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. శనివారం డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 60 మంది విద్యార్థులు తమ సృజనాత్మకతను ఉపయోగించి పరిశుభ్రత, వ్యక్తిగత నియమాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను ఆకట్టుకునే చిత్రాల ద్వారా ప్రతిబింబించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్తలు, పాఠశాల ఉపాధ్యాయులు చిత్రలేఖనాలను పరిశీలించి విజేతలను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుబీనాబేగం, శాస్త్రవేత్తలు హేమలత, శైలజ, సాయి ప్రియాంక పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు మేలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీతో రూ. 5 లక్షల వరకు ఉన్న వైద్యాన్ని రూ. 10 లక్షలకు పెంచి పేదలకు ఉచిత వైద్యం అందించడానికి కృషి చేస్తోందని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఖేడ్, మనూరు, నాగలిగిద్ద మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ సేవలు అందే ఆస్పత్రులను తెలుసుకొని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, భోజిరెడ్డి, తాహెర్‌అలీ, పండరిరెడ్డి, దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాధాకిషన్, గౌస్‌చిస్తి, షాదుల్‌చిస్తి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కళాశాల, పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని డీఎం కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల నుంచి కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సమయానికి బస్సులు నడపడం లేదని ఆరోపించారు. కొండాపూర్ మండలం మల్లెపల్లి, మల్కాపూర్, గొల్లపల్లి, గుంతపల్లి, మునిదేవునిపల్లి మీదుగా మైతాబ్ కాన్ గూడా వరకు ఒకటే బస్సు నడుస్తోంది. ఇందులో 150 నుంచి 200 మంది విద్యార్థులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. వెంటనే ఆర్టీసీ యాజమాన్యం స్పందించి సమయానుకూలంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు బన్నీ, సాత్విక, సిద్దు, సాయిసురేశ్, అకాశ్, నిర్మల ,పప్పీ, మల్లేశ్వరి, సిద్దేశ్వర ,సాయిల్ ,ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నియామక పత్రాలు అందజేత

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ కస్తూర్బాల్లో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, నర్సింగ్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో 51 పోస్టులను అర్హత గల అభ్యర్థుల ద్వారా భర్తీ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ వెంకటేశ్వర్లు వారికి నియామక పత్రాలు అందజేశారు. కస్తూర్బా పాఠశాలల బలోపేతానికి కృషి చేయడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు.

◆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ మండలంలోని కంకోల్ గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు. శనివారం రాంరెడ్డి మాట్లాడుతూ..ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు వల్ల సూమారు 15 గ్రామాల ప్రజలకే కాకుండా, 65వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాథమిక చికిత్సకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే, ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందుతాయన్నారు. 2024 ఫిబ్రవరి 11న కంకోల్ గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం అప్పట్లో దామోదర రాజనర్సింహ్మ శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కంకోల్‌లో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

◆ సంతకాల సేకరణ

నారాయణఖేడ్: ఖేడ్‌లో ఎంవీఐ సేవలు అందించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఖేడ్ రాజీవ్‌చౌక్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ సేవలు అందుబాటులోకి వస్తే వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర సేవలకు ప్రాంతవాసుల ఇబ్బందులు దూరమవుతాయన్నారు. సంఘం నాయకులు చిరంజీవి, దత్తురెడ్డి, పుప్పాల అశోక్, ఆనంద్, రాము పాల్గొన్నారు.

◆ 400 మంది రోగులకు చికిత్సలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎస్‌త్రీ సెడంకర్ కిడ్వానీ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీదర్‌కు చెందిన వైద్యులు సురేశ్, రాజశేఖర్, జోసెఫ్ స్టాలిన్, వినోద, అనిల్ ముద్దాలు సుమారు 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్, లాప్రొస్కోపిక్ పరీక్షలు, మహిళలకు బెస్ట్ క్యాన్సర్, తల, మెడలకు సంబంధించి సమస్యలకు చికిత్స చేశారు. ఆర్థో, యూరాలజీ, నెఫ్రలాజీ విభాగాలతో పాటు ఫిజియోథెరఫీ సేవలు అందించారు.

◆ రమాదేవికి డాక్టరేట్

మునిపల్లి(అందోల్): బుదేరా గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి.రమాదేవికి ఎఫెక్ట్ ఆఫ్ ఎనరోబిక్ ట్రైనింగ్ అండ్ సర్క్యూట్ ట్రైనింగ్ అన్ ఫిజికల్ ఫిట్నెస్, సైకలాజికల్ అండ్ పర్ఫార్మెన్స్ ఎబిలిటీస్ అమంగ్ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన పేర్కొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిమ్నాస్టిక్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన చేసిన సందర్భంగా డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ఆచార్య కే.డి.దీప్ల పర్యవేక్షణలో పరిశోధన చేశారన్నారు. కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

◆ రహదారిపై కూలిన చెట్టు

జహీరాబాద్: జహీరాబాద్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బీదర్ రహదారిపై చెట్టు కూలి ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో చెట్టును పక్కకు తొలగించి, రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. శనివారం భారీ వర్షం కురియడంతో మండలంలోని బాబానగర్ కాలనీ జలమయమయ్యాయి.

◆ మధ్యాహ్న భోజనం తనిఖీ



వట్‌పల్లి(అందోల్): అందోలు మండలంలోని కన్సాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈఓ బి.క్రిష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి, భోజనం ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం ఇందిర, సీఆర్‌పీ శ్రీనివాస్, గోవర్ధన్, నవీన్ పాల్గొన్నారు.

◆ ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్ గడ్డ ఆలయంలో శనివారం భక్తులతో కిటకిటలాడారు. అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్‌లు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

◆ కార్మికుడి మృతిపై మంత్రి దిగ్భ్రాంతి

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలంలోని తాలెల్మ గ్రామ పంచాయతీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మన్నె లక్ష్మయ్య విద్యుత్ షాక్‌తో మృతి చెందడంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు.

◆ బీఆర్ఎస్ నేతకు పరామర్శ

జహీరాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ లావణ్య భర్త ముత్యాల చందును ఎమ్మెల్యే మాణిక్‌రావు శనివారం పరామర్శించారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి వెళ్లి చందు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఎం.డి.తంజీం, నామ రవికిరణ్ పాల్గొన్నారు.

◆ అవగాహన ఉండాలి

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సీఐ మహేశ్‌గౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని సెయింట్ ఆంటోని పాఠశాల ప్రాథమిక విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

◆ బీజేపీ బలోపేతానికి కృషి

పుల్‌కల్(అందోల్): దేశంలో ఎక్కువ సభ్యత్వం గల పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గొంగులూరులో పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ వల్లే దేశం సుర క్షితంగా ఉంటుందన్నారు. ప్రతి యువకుడు పార్టీ సభ్యత్వం తీసుకుని దేశం సమగ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, మండల అధ్యక్షుడు పండరి పాల్గొన్నారు.

◆ శ్వేతకు సన్మానం

పటాన్‌చెరు టౌన్: ప్రజా ప్రభుత్వంలో మహనీయుల కుటుంబీకులను భాగస్వామ్యం చేయడం మంచి పరిణామం అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ఉక్కు మహిళ చాకలి ఐలమ్మ మునిమనమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆమెను నీలం మధు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. అనంతరం ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలసిన శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో సందడిగా మారింది.

◆ సువర్ణ షెట్కార్‌కు పరామర్శ

నారాయణఖేడ్: ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సువర్ణ షెట్కార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొంది.. ఖేడ్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. పరామర్శించినవారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ రుబీనా నజీబ్, కౌన్సిలర్లు స్వప్నఅభిషేక్ షెట్కార్, విఠల్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, ఉబేద్, ఏక్‌నాథ్ ఉన్నారు.

◆ ఉపాధి పనులపై గ్రామసభలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం పనులపై శనివారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. పోచాపూర్, సంగెం, ఉజలంపాడు, చిన్నముబారక్‌పూర్, గరిడెగాం, రూప్లతండా, సూర్య తండా పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై డీఆర్‌పీలు తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీ నివేదికను గ్రామసభల్లో బహిర్గతం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్ పాల్గొన్నారు.